క్లుప్తంగా

లెక్కలు ఫుల్.. ఖజానా నిల్


జి.సింహాచలం

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లెక్కలు ఫుల్.. ఖజానా నిల్ అన్నట్లు ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు జి.సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, బడ్జెట్ చూస్తుంటే వాటిని అమలు చేసే ఉద్దేశం లేనట్లుందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆడబిడ్డ నిధి (18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500) పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేశారని పదే, పదే చంద్రబాబు ప్రచారం చేశారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే లక్ష కోట్ల రూపాయలు అప్పు చేశారని మండిపడ్డారు.

శిష్టకరణ సంఘ అధ్యక్షుడిగా రాంబాబు


రాంబాబును అభినందిస్తున్న సభ్యులు

నరసన్నపేట: స్థానిక శిష్టకరణ సంఘం నూతన అధ్యక్షుడిగా సదాశివుని రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక శిష్టకరణ సంఘ భవనంలో సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షునిగా రాంబాబును సభ్యులు ప్రతిపాదించి ఎంపిక చేశారు. వచ్చే ఆదివారం పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబును సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో శిష్టకరణ సంఘ సభ్యులు ఎం.వి.జె.మోహన్‌రావు, కస్పా ప్రసాదరావు, బూరవల్లి భాస్కరరావు, అంప్లాం వసంతకుమార్, ఎ.పి.వి.రమణమూర్తి, రఘుపాత్రుని శ్రీధర్ (బుజ్జి), కాంతారావు, సింహాచలం, రమణయ్య, రాములు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పూజలందుకుంటున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ముడుపులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రమాణ స్వీకారం


జనార్దనరావు అభినందిస్తున్న సభ్యులు

ఆమదాలవలస: నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షునిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన తాండ్ర జనార్దనరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సైనిక సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో మాజీ సైనికుల ఫౌండర్ సూర అవతారం ఆధ్వర్యంలో ప్యానల్ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జనార్దనరావు మాట్లాడారు. ఆమదాలవలస పట్టణంలో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడమే తమ అందరి లక్ష్యమన్నారు. మాజీ సైనికులకు, వీర నారీమణులకు ఎటువంటి కష్టం వచ్చినా తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఎప్పటిలాగే డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళానికి అఫిలియేషన్ కంటిన్యూ చేస్తామన్నారు. ఉపాధ్యక్షుడు పేడాడ సూర్యారావు, జనరల్ సెక్రటరీ నానుపాత్రుని రామారావు, కో ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావులను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, జామి రమణయ్య, బి.సంజీవరావు,అన్నెపు మురళీధరరావు, సనపల సత్యనారాయణ, పప్పల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమదాలవలస: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని మెట్టక్కివలసలో గల వెనుకబడిన తరగతులు (బీసీ) బాలికల వసతి గృహంలోని బాలికలకు ఆమదాలవలస మహిళా పోలీస్ సిబ్బంది యోగాపై శిక్షణ ఇచ్చారు. మహిళా దినోత్సవం వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కందిపప్పు లేనట్టే..!


కంబకాయలో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం ఇస్తున్న దృశ్యం

నరసన్నపేట నియోజకవర్గంలో కార్డుదారుల వివరాలు				
మండలం	నరసన్నపేట	పోలాకి	సారవకోట	జలుమూరు
రేషన్ కార్డులు	23,354	21,265	16,441	19,165

- ఫిబ్రవరి, మార్చి నెలల్లో కందిపప్పు సరఫరా చేయని వైనం
- కూటమి ప్రభుత్వంపై కార్డుదారుల ఆగ్రహం

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. కందిపప్పు ధరలు కూడా బాగా పెరిగాయి. పౌరసరఫరాలశాఖవారు పంపిణీ చేసే కందిపప్పు అయినా వినియోగించుకుందామని కార్డుదారులు ఆలోచిస్తుంటే.. కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. జనవరిలో అంతంత మాత్రంగా కందిపప్పు సరఫరా చేసింది. ఫిబ్రవరిలో బియ్యం, పంచదారే పంపిణీ చేశారు. మార్చిలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు అనుకున్నారు. ఈ నెలలో కూడా కందిపప్పు సరఫరా చేయపోవడంతో మండిపడుతున్నారు. బయట మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.180 పలుకుతోంది. ఎండీయూ వాహనాల ద్వారా అయితే కేజీ రూ.67లకే కందిపప్పు లభిస్తుండటంతో కొంతవరకు సంతోషించారు. కేవలం కొన్ని నెలలకే పరిమితం కావడంతో ఆందోళన చెందుతున్నారు.


ట్రాక్టర్‌పై గ్రామాలకు వెళ్తున్న బియ్యం, పంచదార

ఒక్కరోజు ముచ్చటే..

కందిపప్పు తక్కువ ధరకే వినియోగదారులకు విక్రయించేందుకు నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గతేడాది నవంబర్‌లో దుకాణాన్ని ప్రారంభించారు. ఆ రోజే తప్ప.. మరుసటి రోజుకు రాయితీ పప్పు లభించలేదు. రేషన్ షాపుల్లో అయినా కందిపప్పు ఇస్తారని ఆశించిన వినియోగదారులకు ఈ ప్రభుత్వం తీవ్రంగా నిరాశ కలిగించింది. ప్రతి కార్డుకూ కేజీ చొప్పున కంది పప్పు నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇచ్చారు. జనవరిలో ఎవరు ముందుగా బియ్యం విడిపిస్తే వారికే కంది పప్పు అందింది. ఫిబ్రవరిలో పూర్తిగా సరఫరా చేయలేదు. మార్చిలో కూడా అదే పరిస్థితి. బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అధికారం చేపట్టాక హామీని తుంగలోకి తొక్కి పూర్తిగా సరఫరాను నిలిపివేసింది. సామాన్యులు కందిపప్పుకు నోచుకోవడం లేదు. సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.

పేదలపై చిన్నచూపు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్క హామీని కూడా సక్రమంగా నెరవేర్చలేదు. కనీసం కందపప్పు కూడా కార్డుదారులకు ఇవ్వడంలేదు. జనవరిలో అక్కడక్కడ ఇచ్చారు. ఫిబ్రవరిలో పూర్తిగా ఇవ్వలేదు. మార్చిలో కూడా మొండి చేయి చూపారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– చింతు అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు, నరసన్నపేట

నమ్మించి మోసం చేయడమే



రేషన్ డిపోల ద్వారా బియ్యంతోపాటు పంచధార, కందిపప్పు రాయితీ ధరలకు పంపిణీ చేస్తామని అధికారంలోకి రాగానే గొప్పగా కూటమి నాయకులు ప్రకటించారు. కొన్ని నెలలకే వీరి మాటలు పరిమితమయ్యాయి. రెండు నెలలుగా బియ్యం, పంచదారే ఇస్తున్నారు. కంది పప్పు ఇవ్వడం లేదు. కార్డుదారులకు మోసం చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది.

– జి.వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, నరసన్నపేట

కందిపప్పు అలాట్‌మెంటే కాలేదు

ఈ నెలలో పంచధార, బియ్యమే ఇస్తున్నాం. ఈ మేరకు డిపోలకు సరుకులు పంపాం. ఈ నెలలో కందిపప్పు అలాట్‌మెంట్ కాలేదు. ఫిబ్రవరిలో కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం సరఫరా చేస్తే డిపోలకు పంపిస్తాం.

– సంధ్య, డీటీ, ఎంఎల్ఎస్ పాయింట్, నరసన్నపేట

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- పలు సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు


ఎంపీపీకి దరఖాస్తు అందజేస్తున్న ఎంపీటీసీలు యరకయ్య, రేణుక

పాతపట్నం: వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను పలువురు సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పాతపట్నం శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ఎంపీపీకి పాతపట్నం-2, 3 ఎంపీటీలు కొండాల యరకయ్య, పోలాకి రేణుక దరఖాస్తు అందజేశారు. చంగుడిలో తాగునీటి పథకానికి బోరు కనెక్షన్ కలపకుండా ఉంచారని, జల్ జీవన్ పథకం పనులు చేపట్టినప్పటికీ తాగునీరు అందడం లేదని సర్పంచ్ తులసీనాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో బోర్లుకు మరమ్మతులు చేపడతామని, మధ్యలో నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. కొరసవాడ, బోరుభద్ర పంచాయతీల్లో జల్ జీవన్ పనులు చేపట్టినప్పటికీ బిల్లులు ఇవ్వలేదని ఈఓపీఆర్డీ వెంకటరావును సర్పంచ్ ఉమ ప్రశ్నించారు. బిల్లుల ప్రాప్తికి నగదును సర్పంచ్‌లు విత్‌డ్రా చేసుకోవచ్చునని ఈఓపీఆర్డీ తెలిపారు. బోరుభద్ర, సీతారాంపల్లి గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేలో ఎల్‌పీ నంబర్లు తప్పులుగా ఉన్నాయని సర్పంచ్ కుమార్ రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. డీటీ బి.వెంకటరమణ సమాధానం చెబుతూ.. భూ సర్వేలో సమస్యలు ఉంటే చెప్పాలని, జేసీకి తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో నాటు సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ కృష్ణారావు కోరారు.

ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కాల్సిన సమావేశం.. 12 గంటలకు ఆరుగురు ఎంపీటీసీలు రావడంతో ప్రారంభించారు. ఎంపీపీతోపాటు పాతపట్నం-2, 3, తిడ్డిమి, ఎస్.ఎస్.మణుగు, బూరగాం ఎంపీటీసీలు హాజరయ్యారు. 12 మంది డుమ్మాకొట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, ఎంపీడీఓ టి.చంద్రకుమారి, మండల ప్రత్యేకాహ్వానితుడు మర్రి గణపతిరావు, మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు, సీడీపీఓ విమలారాణి, మండల జేఈ ప్రసాద్, ఎంఈఓ-2 తిరుమలరావు, ఏపీఓ సురేష్, హౌసింగ్ జేఈ సీతారాం , ఏఈఓ భారతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడు?

సారవకోట: గతేడాది డిసెంబర్ తరువాత మండలంలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది. ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడని పలు గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. అవలింగి, మూగుపురం, పెద్దలంబ తదితర గ్రామాల్లో సుమారు 5 వేల ధాన్యం బస్తాలు వరకు నిల్వ ఉన్నాయన్నారు. దీనిపై శనివారం జరిగిన మండల సమావేశంలో సైతం అధికారులను పలువురు సభ్యులు ప్రశ్నించారు. మండలానికి తగిన టార్గెట్‌లు కేటాయించకపోవడంతో పూర్తిస్థాయిలో కొనుగోలు జరగలేదన్నారు. ఒక పక్క ధాన్యం కొనుగోలు కాకపోవడం, దీనికి తోడు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న మిల్లర్ల దగ్గరకు తీసుకెళ్లగా ఏ గ్రేడ్ ధాన్యం తీసుకునే ప్రసక్తి లేదని తిరిగి పంపిస్తున్నారు. ఏ గ్రేడ్‌కు సాధారణ రకానికి చెల్లించే ధర చెల్లించాలని కోరినా మిల్లర్లు అంగీకరించడం లేదని అవలింగి గ్రామానికి చెందిన రైతు తర్ర పాపారావు అన్నారు. దీనిపై ఏఓ వెంకటరావుకు వివరణ కోరగా.. అదనపు టార్గెట్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. వారి నుంచి అనుమతి వస్తే కొనుగోలు ప్రారంభిస్తామన్నారు.


ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు పాపారావు

అవస్థలు..



సారవకోట మండలంలోని అంగూరులో మురుగునీటి కాలువలు పూడికపోయాయి. ఇళ్లల్లోని వాడుక నీరు రోడ్లుపై ప్రవహిస్తోంది. నడిచేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సారవకోట

ఖాళీ బిందెలతో నిరసన



ఈ చిత్రం హిరమండలం సుభలయలో ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు. హిరమండలం, సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పలు వీధుల్లో పూర్తిస్థాయిలో తాగునీరు అందడంలేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

– హిరమండలం

కొండ చీపుర్లు సిద్ధం..



ఎల్.ఎన్.పేట మండలంలోని గిరిజన రైతులు పోడు పంటంగా పండించే కొండ చీపుర్ల పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మురగడలోవ, సూదిరాయిగూడ, కొత్త బాలేరు, కొత్త వలస, జోగివలస, మెట్టుగూడ, కారిగూడ, కొత్త జోగివలస తదితర గ్రామాలకు చెందిన రైతులు కొండ చీపుర్ల పంట వేశారు. కొండ చీపుర్లకు ప్రస్తుతం మార్కెట్‌లో గిరాకీ ఉంది. చీపురు పుల్లలు ఎండిన తరువాత కట్టలుగా కడతారు. చీపురు కట్ట రూ.40 నుంచి రూ.60 వరకు ధర పలకనుంది.

– ఎల్.ఎన్.పేట

చెత్తను తొలగించండి



మేజర్ పంచాయతీ హిరమండలంలోని చిన్నకోరాడ ప్రాథమిక పాఠశాల వద్ద స్థానికులు వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ చెత్తను తీసివేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయంపై మేజర్ పంచాయతీ ఈఓ వద్ద ప్రస్తావించగా.. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగిస్తామన్నారు. స్థానికుల సహకారం ఎంతో అవసరమని, పాఠశాల వద్ద చెత్తను వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

– హిరమండలం

ఆదివాసీల జీవితాలు అంధకారం చేయొద్దు

- థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్

బూర్జ: సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆమదాలవలస నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో ఆదివారం పర్యటించి ఆదివాసీల అభిప్రాయాలు సేకరించారు. థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘ నాయకులు, ఆదివాసీలతో మాట్లాడారు. పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు విరమించుకోకపోతే మరో గిరిజన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఆదివాసీలు అన్నారు. బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ వలన రెండు మండలాల్లోని వెన్నెలవలస, లక్ష్మీపురం, శ్రీరామవలస, మదనాపురం, బొడ్లపాడు, అద్దూరిపేట, జె.వి.పురం, సోమిదలవలస, గోపిదేవిపేట, జంగాలపాడు, బొడ్లపాడు, తదితర గ్రామాల పరిధిలో సాగుచేస్తున్న పోడు వ్యవసాయం నాశనం అవుతుందని ఆదివాసీలు అన్నారు. ఆదివాసీలకు అండగా ఉంటానని సువ్వారి గాంధీ హామీ ఇచ్చారు. ఉద్యమాలు ఉధృతం చేయక ముందే ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. సురేష్ దొర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సువ్వారి సత్యనారాయణ, రాపాక పోతురాజు, సూర్యనారాయణ, కె.సాయికుమార్, పైడి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


తిమడాం జంక్షన్‌లో సువ్వారి గాంధీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

వైస్ ఎంపీపీ మృతి


వైస్ ఎంపీపీ అసిరయ్య (ఫైల్)

సారవకోట: సారవకోట వైస్ ఎంపీపీ (పెద్దలంబ ఎంపీటీసీ), వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎడ్ల అసిరయ్య (84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. అసిరయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. మృతునికి భార్య అమ్మన్నమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, కొండాల బాబూరావు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు


మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జలుమూరు: ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ అన్నారు. ఆదివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, మోడల్ పరీక్షలపై సూచనలు చేశారు. ఉపాధ్యాయులు జల్లు రమణమూర్తి, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

అంధకారం


పాతపట్నం రైల్వే గేటు వద్ద వెలగని విద్యుత్ లైట్లు

పాతపట్నం: పాతపట్నం రైల్వే గేటు వద్ద విద్యుత్ లైట్లు కొద్ది రోజులుగా వెలగడం లేదు. ఇటీవల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్లాట్ ఫాం వద్ద విద్యుత్ లైట్లు వెలిగినప్పటికీ.. గేటు వద్ద ఇరువైపులా విద్యుత్ లైట్లు వెలగడం లేదు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో కొద్ది రోజుల నుంచి గేటు వేసే సమయంలో శ్రీకాకుళం, టెక్కలి నుంచి పాతపట్నం వచ్చే వాహనదారులు రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నారు. చీకటిమయం కావడంతో కుక్కలు ఇక్కడకు చేరుకుని ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి విద్యుత్ లైట్లు బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేటినుంచి సామాజిక తనిఖీలు

కొత్తూరు: ఈ నెల 3 తేదీ నుంచి మండలంలోని 43 గ్రామ పంచాయతీల్లో 25 రోజులపాటు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏపీఓ ప్రేమలత ఆదివారం తెలిపారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 1,042 పనులకు రూ.6 కోట్ల నిధులు ఖర్చు అయినట్లు చెప్పారు.

ఈ నిధుల వ్యయంపై సామాజిక తనిఖీ బృందాలు పంచాయతీల వారిగా తనిఖీలు నిర్వహించిన అనంతరం ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు.

నాణ్యత డొల్ల..



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని దాశరదీపురం కూడలి వద్ద గోతులమయంగా ఉన్న అలికాం-బత్తిలి రోడ్డు. నీలకంఠాపురం-దాశరదీపురం గ్రామాల మధ్య అడుగుకో గొయ్యి ఏర్పడింది. ఈ రహదారిలో ప్రయాణం నరకాన్ని తలిపిస్తోంది. ఈ గోతులను ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టిన నెల రోజులకే తిరిగి గోతులు ఏర్పడటంతో నాణ్యతపై ప్రయాణికులు మండిపడతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చే పనులు నాణ్యతగా చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– కొత్తూరు

పోటీతత్వం అలవాటు చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: విద్యార్థులు చదువుతోపాటు ఆట, పాటల్లో పోటీతత్వం అలవాటు చేసుకోవాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు, కార్యదర్శి డి.సుజాత అన్నారు. తురకపేట సెంటర్‌లోని ఎస్.వి.స్కూల్ ప్రాంగణంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

పోటీతత్వం అలవాటు చేసుకున్న విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాను అధిరోహిస్తారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే చదువుల్లో పోటీ పడాలన్నారు. పరీక్షలంటే భయం వీడాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

100 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాలకొండకు చెందిన శ్రీసుమలత అర్థోపెడిక్ క్లినిక్ వైద్యుడు పి.సతీష్‌కుమార్ 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 8 మందిని మెరుగైన వైద్యం కోసం పాలకొండ శ్రీసుమలత అర్థోపెడిక్ క్లినిక్‌కు రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సాయి సంఘ సభ్యులు, కన్వీనర్ గౌరీశంకర్, హాస్పటల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

వ్యాక్సినేషన్ పరిశీలన


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ మంచుకరుణాకర్

మెళియాపుట్టి: నాలుగు నెలల వయస్సు దాటిన ప్రతీ పశువుకి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని పాతపట్నం ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు మంచుకరుణాకర్ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. మండలంలో మూడు టీమ్‌లు వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నాయన్నారు. 15,200 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆ తర్వాత బూస్టర్ డోస్ వేస్తామన్నారు. పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.